# చలమయ్య సంసారం

'స్వాక్షి'

గడియారం రెండు చేతులా కాలచక్రాన్ని తిప్పుతోంది. సాయంత్రం నాలుగయింది. తొందరగా తిరిగి వస్తాడనుకున్న దాసు రాలేదు. కాలాతీతం అయింది. కాలం మనుషులూ కలిసి కావలసినంత ప్రపంచాన్ని సృష్టిస్తారు. లేకపోతే, నిక్షేపంలాంటి బట్టల వ్యాపారంలో ఏవో చాలక నా దాసుకమీషను వ్యాపారానికి తల తగిలించాడు. 'ఎందుకొచ్చిన పుర్రాకులివన్నీ, ఇవతల వ్యాపారం గగ్గోలు చేసుకోడానిగ్గాని' అని చలమయ్య, చెంప్రటుకలు పలచబడ్డ తల గీరుకుంటూ తఖియామీద చతికలబడ్డాడు.

క్షణం ఆగి, విసుగ్గా బట్టలు సర్దుతున్న కోటయ్యను, 'ఒరేయ్ దాసు వస్తున్నాడేమో చూడు' అన్నాడు. ఇంతలో దాసు రానే వచ్చాడు, అలసట దులుపుకుంటూ. 'తాఖత్ ముల్లుగాడితో నా కమీషను వ్యాపారం, వాడో ఘండాలం. చెరిచి బ్రతికే బదుద్దాయి, వాడి...' చలమయ్య మాట పూర్తికాకుండానే దాసు—'దుగ్గిరాల పసుపులో ఈ టో అయిదొందలు మనవాటాకొచ్చాయి' అని వజ్రాలొలికే మాటలు అందించాడు. చలమయ్య గుండెల్లో సంతోషం పెదాల వరకూ పొంగుతూంటే, ప్రక్కవాటుగా ముఖం తిప్పి వాలిపోతున్న మీసం ఆప్యాయంగా తిప్పుకుంటూ దాసు 'చలాకీ'ని శ్లాఘించుకున్నాడు లోలోపల. సొరుగులో దాచిన ఉత్తరం జ్ఞాపకం రావడంతో మనసు చురచురలాడింది.

'ప్రకాశం ఉత్తరం వ్రాశాడు చూచావా...' చలమయ్య, చిత్రాల్లో మునిగిపోయిన దాసు మీదికి ఉత్తరం గిరవాటేశాడు. దాసు ఒక్కగుక్కలో చదివి 'సరే' అని ఊరుకున్నాడు. చలమయ్య ప్రకాశం మీద ఒక దండకం చదివి, అంతటి అప్రాచ్యుడు తనకు కొడుకు కావడం తలవంపులుగా ఉన్నదని విసుక్కున్నాడు కాస్సేపు. 'బొంబాయి వెళ్ళి ఉద్ధరిస్తున్నట్టు మూడొందలు పంపమంటాడు...' గింజుకున్నాడు పళ్ళుగిట్టకరిచి కోపంగా. 'ఒరేయ్ దాసూ, నీ బోడి సలహామీదే వాణ్ణి సిల్కుబట్టల వేగానికి పంపాను. వాడుచేసే నిర్వాకానికి మళ్ళీ మూడొందలట.....అక్కడా సినిమా పిచ్చిలో పడ్డాడేమో...'

'ఊరికి నే ఉంటే ఎలాగా! కొట్లో కూచోడానికి నామోషీ. మరి బయటవ్యాపారమన్నా అబ్బుద్దని...'

'నువు చెప్పేది సరేలే. వాణ్ణిదివరకు మద్రాసు పంపితే మలబారు సరుకుమీదవ్యాపారం సులువుగా సాగుద్దని, వాడేం చేశాడు చివరికి...?'

'దాని కేం చేస్తాం, కనీసం జేబురుమాళ్ళలోనన్నా ఖరాఖండీ అయిన లాభం మిగులుద్ది...'



## —'కన్సొలేషన్' బహుమతి పొందిన కథ—

జీవితం రాచబాటగా సాగుతున్నప్పుడు వెనుకటి అనుబంధాలు భారమై చివరికి త్రెంచుకోవలసి వస్తుంది. తిరిగి జీవితం గతుకులలో బడి అంధకారం అలముకొన్నప్పుడు ఆ పాత అనుబంధమే ఏడుగడగా భాసిస్తుంది-చిత్రమే మరి!

'వాడి కా తెలివేది, సినిమాషోకుల్లో పడ్డ వాడికి, చివరికేమయింది, డబ్బంతా నాశనం. రోడ్డ మీద తిరిగిచస్తుంటే ఇంటికి తెప్పించుకోక తప్పలేదు'—కొడుకును తలుచుకున్న కొద్దీ కోపం పిచ్చిగా తలతిప్పుతోంది.

చలమయ్య బట్టలమూట భుజాన వేసుకుని చెప్పులు అరిగేలా ఇల్లిల్లూ, వాడవాడా తిరిగి వ్యాపారం చేశాడు. కాసు సంపాదించడం ఎంతకష్టమో తన భుజం పడ్డబాధ చెబుతోంది. చివరికి పెద్దబజారులో బట్టలఅంగడి తెరచి చిన్నబట్టల వ్యాపారస్తుడయ్యాడు. ఇల్లు కట్టాడు. ఇంటివాడయ్యాడు. నలభైఏళ్లు దాటి వయస్సు ఏభైదగ్గరగా పరుగెత్తుతున్నా, తనవయస్సు ముప్ఫై ఏళ్లలో నిలిచిపోయిందనుకుంటాడు. ఈలోగా సర్వసుఖాలతో తులతూగే ప్రపంచాన్ని అనుభవించగలిగాడు. కాని వ్యాపార మొక ఎత్తుగా పెంచుతూనే వచ్చాడు గనకనే ఎక్కడా జారిపడకుండా నిలబడ గలిగాడు. నిజానికి తన కొడుక్కంటే పెద్ద పాపాల్లాంటి సుఖాలే అనుభవించాడు. కాని, ఇరవై ఏళ్ళునిండిన కొడుకు సుఖాలు, జల్సాలకూ తగిలి అందులోనే అంటుకుపోయిన అశోకుడే, చవటదద్దమ్మ అని నోరు చప్పరించి, తన ఘనత నెమరువేసుకుంటున్నాడు కళ్ళద్దాలు సవరించుకుంటూ-

అయిదూ ఎనిమిదిగంటల్లో గిరాకీ మరీఎక్కువగా ఉంటుంది. చురుగ్గా అప్ప



# చలమయ్య సంసారం

కాళ్లు పీకుతున్నాయి. ఒక్కగానొక్క కొడుకు కోసరం నానా అగచాట్లూ పడి వ్యాపారం వృద్ధిలోకి తేవాలని, పెడదారులు తొక్కుతున్న కొడుకు నొకదారికి తేవాలనీ అనుకుంటున్న ఆలోచనలన్నీ వృథా అవుతున్నాయని విచారించాడు. మూలుగుతున్న బాధ కొట్టులో చలమయ్య చురుకుతనం తగ్గించింది. ఆలోచనలు పిచ్చిగా గుడ్లగూబల్లా కూచుని చూస్తున్నాయి తలలో. దాసు అన్నీ చక్కబెట్టుకుంటున్నాడు. చలమయ్య డబ్బు గల్లాపెట్టెలో చేరేసుకుంటూ ముగ్గుముగ్గ జోగిపోతున్న కుర్రాళ్లను అజమాయిషీస్తున్నాడు. దీపాలు వెలిగాయి. అరచేతులు చూచుకుని లక్ష్మీదేవిని కటాక్షించమని కోరుకున్నాడు మనస్సులో—

ఇంతలో,——

'దాసం చలమయ్య మామా.' రెండు చేతులూ జంటగా ఎత్తి రోడ్డుమీదనుంచే నమస్కారం చేశాడు భద్రం. చలమయ్య పక్కనే కూచుని ప్రారంభించాడు మెల్లిగా.—

'ఏం గిరాకీలో ఉన్నావనుకుంటా...'

'మీ కొట్టుకు సమపాళియా మాది, చిల్లర కొట్టు.'

'అయితే ఏం. చిల్లర శ్రీ మహాలక్ష్మి, నీకేం మామా.'

'పోనుకోవయ్యా భద్రం, కోమటి బిడ్డ ననిపించుకున్నావు ఎంతైనా......మాదేం ఉందిలే, అల్లుడా...' గట్టిగా నవ్వి భద్రం భుజంనిగ నిరిచాడు చలమయ్య.

దసరా ఉత్సవాలు చెయ్యాల్సిన రోజులు దగ్గరకొస్తున్నాయి. ఆంధ్రదేశంలో ఉత్సవ నిర్వహణలో ఆ ఊరిది ప్రత్యేకత కావడం చేత, ముఖ్యంగా నిర్వహించగలిగే వణిక్ప్రముఖులు ఒక పెద్ద బాధ్యతగా తీసుకుంటారు. అంతవరకూ ఏ సంవత్సరమూ శలంకీగా నిర్వహించే చలమయ్యను కదిలించడానికి భద్రం వచ్చాడు. చలమయ్య చిన్నరకం కోమటైనా, ఉత్సవ నిర్వహణలో అతని ఉత్సాహం వేరు. సంబరమంతా అతనిదే. అతడు పూనుకోందే ముఖ్యంగా ఒక్క మేజువాణీ నాయకురాలూ ముందుకు వచ్చేది కాదు. ముఖ్యమైన మేళాల్లో ఒక్కటి తక్కువయినా ఉత్సవానికి లోటే మరి! దసరా అందానికి వెలితే మరి! చలమయ్య [illegible]. సాము గరిడీలు, [illegible], బ్యాండు మేళాలు, ఉత్సవ విగ్రహాలు, భజనదాసులు, బొమ్మల మేళాలు, డోలూ సన్నాయిలూ వరసగా నిలబెట్టి, ముఖ్యముఖ్య మేజువాణీ కట్టించే వాడు. ప్రతి వాహనం ముందూ ఏ మేళం ఎక్కడుండాలనే ఫురమాయింపులో చలమయ్యదే పైచేయి. [illegible] పై తనదే. పిఠాపురం పారిజాతం, పెద్దాపురం పంకజాక్షి, కాకినాడ కమలాక్షి, రాజోలు గన్నెంగి, అమలాపురం అమ్మాణి, రాజమండ్రి రంగ, మాదుగుల మాణిక్యం, సాలూరు సామ్రాజ్యం, టెక్కలి తంగమణి, మైసూరు మోహనాంగి, దక్షిణాది నాంచారి వగైరా వగైరా ఎన్నో మేళాలు అన్నీ ఆరోజుకు దించి చలమయ్య గ్యాసులైట్ల మధ్య రంజుగా ఆడించేవాడు. మేజువాణీలు పోయాయి. ఉత్సవాలు కొడిగట్టాయన్నారు. కనీసం ఉత్సవ విగ్రహాలైనా అందంగా ఊరేగించగలిగిన హుందా ఒక్క చలమయ్యకే ఉండడంవల్ల భద్రం ఎంతగానో బ్రతిమాలాడు, మరో గంటలో ఉత్సవం తాలూకు నిర్వహణకు జరగాల్సిన చర్చల్లో పాల్గోనమని. అందుకు ఒప్పించి మరీ వెళ్ళాడు.

ఉత్సవసంఘం ఎదురు మాస్తుంటుందని లేచాడు. దుకాణం మూసేసి దాసును ఇంటికి వెళ్ళమని చెప్పి, చలమయ్య బయలుదేరాడు. దారంతా ఆలోచనలు పుట్టల్లో పాముల్లా పడగెత్తి ఆడుతున్నాయి. కాలం వెక్కిరిస్తూ వెనక్కు నడుస్తోందని వ్యథ. 'వెనకటి రోజులు...' అని మూలుక్కునాడు. వర్షపు తుంపరలకు గొడుగొగ్గి చలికి ఒగ్గిపోతున్న శరీరాన్ని నిగడదీసుకుంటూ నడుస్తున్నాడు. రేగిన ఆలోచనలు తనవెంట తలలో నడుస్తూన్నాయి, చీకట్లో, తెరవెనక చీకటిలా అంతా.—

అలివేలుతో కాపురం చేసినన్నాళ్ళూ పైలాపచ్చీసుగా, పదహారణాల స్వేచ్ఛతో హాయిగా గడిచిపోయింది. ఊళ్లో ఒక నాటకం కంపెనీ పోషించి, చిన్న కళాపోషకుడయ్యాడు. ఎందరితో తనకు పరిచయమున్నా తన మాటలవ్యాపారంలో పరిచయమయిన మాణిక్యం బీబీనాంచారమ్మలా, అలివేలుతో సమంగా హక్కులు పంచుకుంది. అలివేలు అచ్చం రుక్మిణీదేవిగానే ప్రవర్తిస్తూ 'పతివ్రత' అనిపించుకుంది. అలివేలు పాతివ్రత్యంమీద చలమయ్య మాణిక్యంమీద మక్కువ చెల్లించుకుంటూ వచ్చారు. మాణిక్యం ప్రపంచం తూచి యివ్వగల సంసారానికి హక్కు మొదటే పంచుకున్నా, ఆ భాగ్యానికి నోచుకోలేని చలమయ్య పక్కకులం మలుపులోనే ఆగిపోయి, ప్రాప్తించిన సగంలో సగంసంసారంతో తృప్తి చెందింది. సంఘం విసిరిన బూతుగాళ్ళను గుండెల్లోనే దాచుకుంది నిబ్బరంగా. అలివేలును ఇలవేల్పుగానే వుంచి తానుమాత్రం గడప అవతల గడిపింది. చలమయ్య కళ్ళచలువ చాలనే తృప్తిలో ఆగిపోయింది. తనకేం లోటని అనుకుంది. అనుకోకుండా అలివేలు కళ్లుమూసింది. మాణిక్యానికి రోజులు మారాయన్నారు అంతా. కాని చలమయ్యహృదయసింహాసనంమీద తనకు వస్తుందనుకున్న హక్కు జారిపోయింది. అందరూ పట్టుపట్టడంవల్ల, తనలో కొంత జిగీష ఉడ్డుగడంవల్ల చలమయ్య కాంతాన్ని రెండో పెళ్ళి చేసుకున్నాడు. మాణిక్యంలో అంతవరకూ వేచివున్న స్వార్థం లావాలా ఉడికి చిమ్మింది. అనవలసిన నాలుగుమాటలూ ముఖాన అనేసింది, చలమయ్యమీద అక్కసుకొద్దీ. తన బ్రతుకు తాను బ్రతకడానికి సిద్ధమయింది. పళ్లవ్యాపారం చేస్తూ పొట్టపోసుకుంటోంది.

చిన్న పళ్లదుకాణం. మధ్య గుడ్డిదీపం రెపరెపలాడుతూంది. మాణిక్యం బేరాలు సాగిస్తూంది. చలమయ్యనాళ్లు పలుపారయ్యాయి. చలమయ్య ఆలోచనలకు వయస్సు మళ్ళింది. ఇంట్లో కాంతం దోగవచుస్సు తనకో ఆలంబనగా, ఆనందంగా ఉంది. మాణిక్యం అక్కసుకొద్దీ తనను నాలుగు మాటలు అన్నదికాని తనమీద మమకారం పోయినట్టులేదం, అనే ప్రశ్న నిలిచిపోయింది. అయిదేళ్ళనుండి ఎటూ మొదటి గాలితిరుగుతున్నా, కొడుకడ్డంగా ఎక్కడ పరామర్శకు దించుతుందోనని తనను తాను దాచుకోవాలనిపించింది. గొడుగు కొంచెం ఓరగా పెట్టి, 'ఏమి ఆడాళ్లో...' అని ప్రాణం నిట్టూర్చినట్టు నడిచాడు. ఉత్సవసంఘంలో కబుర్లు అయేటప్పటికి బాగా పొద్దుపోయింది. ఇంటి ముఖంపట్టాడు.

ఇంట్లో గుడ్డిగాదీపాలు వెలుగుతున్నాయి. పిల్లి సుష్టాగా పాలుత్రాగి నోరు చప్పరిస్తూ ఎదురయింది. వంటగదివైపు వెళ్లాడు. అంతా చెల్లాచెదురయింది. పక్కతలుపు తెరచుకుని దొడ్డివైపుకు నడిచాడు. కాంతం వరండా స్తంభానికి చార్లబడి దాసుతో కబుర్లుచెప్పతున్నది ఖులాసాగా! ఒళ్లంతా విద్యుత్ స్పృశక్కరించినట్టయింది. కళ్లు తిరిగాయి. దాసును నిలువునా చీరెయ్యాలని అనుకున్నాడు. పదేళ్ళ కుర్రాడప్పుడు, గతిలేనివాణ్ణి కొట్టులో కొలువుకు పెట్టుకుని, ఇంట్లో తను పెంచి పెద్దవాణ్ణిచేసిన దాసు, తన ఇంటి వాసాలు లెక్కపెడతాడని అను

---

గారడీవాడు:- అయ్యా! మీరంతా ఆశ్చర్యపడేటట్లు నేనిప్పుడు మండుతున్న నిప్పులు, మేకులు, తాళ్ళు, గాజు పెంకులు మింగుతాను. ధర్మప్రభువు లంతా తలో కాని అర్ధణా ధర్మంచేస్తే ఇన్ని గంజినీళ్ళు కాచుకొని త్రాగుతాను.

ప్రేక్షకులలో ఒకడు:- ఓరి నీ ఆకలికూలా! అన్ని వస్తువులు మింగినా, నీ కింకా ఆకలితగ్గదన్న మాట!

—కనమర్లపూడి హనుమంతరావు
(కావలి)

లేదు. అనుకోని ఆవేశంతో, ఒళ్లు తెలియని బాధతో నాలుగు కొట్టాడు. కాంతాన్ని తన నోటికొచ్చినవన్నీ తిట్టాడు. ఇల్లంతా పెచ్చురేగింది. ఆ రాత్రి గడవలేదు. కంటిమీద కునుకు రాలేదు. జీవితంలో తన ఇచ్ఛ తిరోగమనానికి తిరగడం ఇదే మొదలనుకున్నాడు. 'ఛీ, ఏమి ఆడాళ్ళు' అని గింజుకుంది ప్రాణం. పాడుకళ్ళతో మంచం మీద వాలిన చలమయ్యకు మరి నిద్రలేదు. ఆకలిలేదు. నిస్సత్తువగా జీవితం జారిపోతున్నట్టు దేహం వాలిపోతోంది. మూలుగుతోంది మంచంమీద, మండుతున్న ఆవేశం నివురుగప్పిన నిప్పులా.

అంతుపట్టని రౌద్రంతో కళ్లు చింతనిప్పులయ్యాయి. కోపం తెచ్చిన పిచ్చిసత్తువతో రివ్వున లేచాడు. కాంతాన్ని నరికి పాతరవేద్దామనుకున్నాడు. ప్రతి గదీ వెదికాడు. చివరికి చిందరవందరగా పడివున్న వంటగదిలోకి నడిచాడు. గడప తగిలి ఆవేశంగా గదిలోకి తూలాడు. చేయి కత్తిపీట ప్రక్కనే పడింది. కొంచెంలో చేతికి కాటు వేసేదే. కాని ఏది కాంతం! పిచ్చివాళ్ళా అరిచాడు. తూలుతూ తిరిగి మంచంమీదికి వాలాడు. ఉదయమే వచ్చిన కోటయ్యను అడిగాడు 'దాసు ఏడిరా?' అని. వాడు తెలీదన్నట్టు ముఖం పెట్టాడు. పిచ్చికోపంతో వాణ్ణి అవతలికి తరిమాడు. జీవచ్ఛవంలా మంచంమీద వాలిపోయాడు, బల్లిలా.

వర్షం కురిసి వెలిసింది. మేఘాలుకప్పిన సంధ్యచీకటిమధ్య విప్పారుతున్న తెలిమెఱుపులు చురుక్కున వెలుగులొలికిస్తున్నాయి, ఆరిపేస్తున్నాయి, ఉరుముల మధ్య. వెరగు ముఖంమీదుగా కప్పుకుని తడిగా నడిచివస్తున్న అలికిడి వినిపించింది.

## చలమయ్య సంసారం

కిటికీనుండి కనిపిస్తోంది. వచ్చేవ్యక్తి మాణిక్యమని గుర్తుపట్టడానికి ఎంతోసేపు పట్టలేదు. చలమయ్యను ముఖం దాచుకోవాలనే వ్యధ బాధపెట్టింది. మాణిక్యం చరచరా లోపలికంటావచ్చి తన ప్రక్కనే కూర్చుంది. రిక్తబడి చూస్తున్న కళ్ళల్లోకి నవ్వింది మాణిక్యం. చలమయ్య రెండుకళ్ళూ దించుకుపోయాయి. హృదయం బావురుమని ఏదో వ్యథ చెప్పుకోవాలని ఆక్రోశించింది.

'ఏం జరంగాని వచ్చిందా.....?' అని మాణిక్యం చలమయ్యఒళ్ళు తాకింది. చలమయ్య ప్రాణం లేచి నిలుచున్నట్టయింది. రెండుచేతులా మాణిక్యంచేతులు పట్టుకున్నాడు. నీరసంగా మాణిక్యం చేతికి అంటుకుపోయాయి. ఏమీ లేదనట్టు తల తాటించాడు.

'రోగం లేదు రట్టూ లేదన్న మనిషికి దిగులెందుకంట, ఉత్తి మనేదలేపట్టుకోక సావుకొరూ...' అని గట్టిగాఅరిచింది. లేవనెత్తింది. చంటిపిల్లాళ్ళా రెండు గప్పలేసి కూర్చున్నాడు. ఆరోజు మాణిక్యం చేతిమీదుగా ఎంగిలిపడ్డాడు చలమయ్య.

వానవెలిసిన సాయంత్రం. ఇంద్రధనుస్సు వెలిగిన సంధ్య. ప్రకృతి లాస్యం అందంగా ఉన్నది. అయినా చలమయ్యగుండెల్లోమంట 'దాసు కనిపించాడా...'అని అడుగుతోంది.

'వుత్రాళ్లతో ఎందుకు పోనిద్దూ, కమీన సేపారం జేసుకుంటున్నాడట పాపం...' అని కథ తెలిసిన కథకురాలుగా చలమయ్య ఆలోచనలు అదుపులో పెట్టింది.

ఆలోచనలు చిరడా వేసుకున్నట్టు స్తబ్ధుడయ్యాడు, మాణిక్యం జాలితనంలో చిక్కుకుని ఉక్కిరి బిక్కిరయ్యాడు. తూగిపోతున్న దేహం మంచం మీద వాల్చాడు. తన కిక ఆప్తులెవరూ అని బావురుమంది వీగి అలిసి ఓడిపోయిన హృదయం.

అయిదేళ్లనుండీ తప్పించుకు తిరగాలనుకున్న సంబంధం ఒక్క క్షణంలో మెఱుపులా అతుక్కున్నట్టయింది. ఎప్పుడూ తన దగ్గరే మాణిక్యం లేకపోతే గుండె పగిలిపోతుందేమోననిపించింది. అలా అని మాణిక్యంతో అన్నాడుకూడ దిగులుపడ్డముఖంతో.

'నేనేం చచ్చిపోయా ననుకున్నావా... బొత్తిగా...' అని నూకలేస్తూ లాలించింది మాణిక్యం.

'నువ్వుకూడ లేకపోతే నేనెలా బ్రతగ్గలననుకున్నావ్' అంది చలమయ్య ఒంటి ప్రాణం, ఏదో జిజ్ఞాసతో.

మాణిక్యంహృదయం కంపించి స్పందించినవీణ మ్రోగినట్లయింది. అహల్యశాపం విడిన రామస్పర్శలా ఒక జన్మ మోక్షం మెత్తనట్టనిపించింది. నిట్టూర్చింది! ఇరవై ఏళ్ళక్రితం కొళ్ళరిగేటట్టు, భుజం మండేటట్టు కష్టపడుతూన్న చలమయ్య జ్ఞాపకం వచ్చాడు. తాను పెద్దవాడై, తనకు చిన్నతనం చేశాడే అని రగిలి ఉక్రోషించిన మనస్సు చలమయ్యమీద పడి, జాలితో ద్రవించిపోయింది. అతడి ఆ వేదనా, ఆకృతీ కబళించింది. దుఃఖం పొర్లుతూంటే 'బొట్టు బొత్తిగా చిన్నదయిందే...' అని వెనకటిరోజుల్లో తాను ఉంచుకునే బొట్టు ప్రమాణాన్ని గుర్తుకు తెచ్చిన మాటలు పెదాల్లోనుండి చిరునవ్వు ఒలకబోసింది. ★


# తెలుసుకొని బాగుపడండి




దాంపత్య సుఖాలు అనుభవించుచు కూడ, గర్భము రాకుండుటకుగాను అనేక దేశాలలోని ప్రముఖ డాక్టర్లు కనిపెట్టిన సరికొత్త 60 మార్గాలు "సంతానం" అనే తెలుగు పుస్తకంలో వున్నాయి. అవసరం లేనపుడు గర్భంరాకుండా చేసే 60 మార్గాలు, సుఖ ప్రసవానికి గర్భిణీలు ముందుగా తీసుకోవలసిన జాగ్రత్తలు, పసిబిడ్డలను పుష్టిగా, ఆరోగ్యంగా ఎక్కువ ఖర్చు లేకుండ పెంచే మార్గాలు బొమ్మలతోసహా ఉన్నాయి. సంసార సమస్యలు తీర్చడానికి ఆధారపడతగిన పుస్తకరాజము. ఈ అద్భుతగ్రంథాన్ని మీరు చదివితీరాలి. రచన: ఎ. యస్. మూర్తి, యం. ఎ., వెల రు 3-50. పోస్టుఖర్చులు ఉచితం. "మూర్తి & కో. విభాగము" 88, పీటర్సు రోడ్, మద్రాసు-14 కు ఉత్తరం వ్రాస్తే వెంటనే మీకు వి. పి. పోస్టుద్వారా పంపబడును.

SWASTIK